క్లుప్తంగా

భారత సైన్యం వీరోచిత పోరాటం అభినందనీయం



పెదకాకాని: దేశ ప్రజల కోసం సరిహద్దుల్లో యుద్ధాలు చేస్తున్న భారత సైన్యం పోరాటాలు అభినందనీయమని పెదకాకాని రాజరాజేశ్వరి మెమోరియల్ ఆసుపత్రి డాక్టర్ సూర్యదేవర హనుమంతురావు అన్నారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ వార్‌కు మద్దతుగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం, పాకిస్తాన్ అరాచకాలు, అమాయక ప్రజలపై కాల్పులు జరిపి హతమార్చడం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రామలింగేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వేజండ్ల (చేబ్రోలు): ఆర్థిక సమస్యల కారణంగా ఓ యువకుడు గతనెల 28న ఎలుకల నివారణకు పెట్టే మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వేజండ్ల గ్రామానికి చెందిన తాటిమళ్ల సాయి(28) వ్యాపారం ఇతర కారణాల వల్ల ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. మనస్థాపానికి గురైన సాయి గత నెల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు గమనించి గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి శుక్రవారం మరణించాడు. మృతుడి తల్లి శివనాగమల్లేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

చేబ్రోలు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ మరమ్మత్తులు, ప్రతినెలా రెంగో శనివారం మరమ్మత్తుల నిమిత్తం చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఏకా పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడే క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అవకాశాన్ని పొన్నూరు, కాకుమాను మండలాల పరిధిలోని కక్షిదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం



పెదకాకాని: రాష్ట్రస్థాయి అండర్ 7 చదరంగ పోటీలు శుక్రవారం పెదకాకాని ఎస్ కన్వెన్షన్‌లో ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి హాజరైన చార్టెడ్ అకౌంటెంట్ దామచర్ల శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు పోటీలు జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ చదరంగం జాయింట్ సెక్రటరీ రాజీవ్, టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి, జి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ పరిశుభ్రతకు సహకరించాలి

సూపరింటెండెంట్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మీ కోసం మేము కార్యక్రమం 13వ వారం శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ రమణ రోగులతో డాక్టర్ పేషెంట్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆస్పత్రిలో ఉన్న రోగుల సహాయకులకు వేసవి కాలంలో ఆహార నియమావళి గురించి వివరించారు. వైద్య సేవలు మెరుగ్గా అందించేందుకు సిబ్బందితో సహకరించాలని సూచించారు. సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరించి మెరుగైన చికిత్స అందించేందుకు కృషి చేస్తామని డాక్టర్ రమణ హామీ ఇచ్చారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా పేద రోగుల సహాయకులకు 25 కేజీ బియ్యాన్ని నర్సింగ్ సిబ్బంది పంపిణీ చేశారు.

జూన్ 10 వరకు 'కిశోరి వికాసం'

- ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అంశాలు, చట్టాలపై చైతన్యవంతం
- వేసవిలో బాలికలకు శిక్షణ కార్యక్రమాలు



అరెమండలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

పొన్నూరు: వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'కిశోరి వికాసం' పేరిట నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కౌమార బాలికలలో సామాజిక అంశాలపై అవగాహనతో పాటు ఆడపిల్లలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ, పోటీ ప్రపంచంలో తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించేలా విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలను వివరిస్తూ వారిలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జూన్ 10 వరకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 11 ఏళ్ల వయస్సు నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులతో పాటు విద్యకు దూరంగా ఉన్న బాలికలకు గంటపాటు శిక్షణ ఇస్తున్నారు. గ్రామాల్లో కౌమార బాలికల వివరాలను సేకరించి బృందాలుగా ఏర్పాటు చేసి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

241 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బాలికలకు డీఆర్‌డీఏ వీఏఓ, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తల నిర్వహణలో బాలికలకు అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ అధికారులు చర్యలు చేపట్టారు.

కార్యక్రమాల వివరాలు..

ఈనెల 13న పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టం.. 16న కౌమర దశలో రక్తహీనత.. 20న లింగ అసమానత, ఆడ పిల్లలపై వివక్ష.. 23న విద్య, కెరీర్‌పై సూచనలు, నైపుణ్య ప్రాముఖ్యత.. 27న సైబర్ రక్షణ, భద్రత, సమస్యలు.. 30న ఆర్థిక అంశాల నిర్వహణ.. జూన్ 3న బాలికల నాయకత్వ లక్షణాలు, సాధికారిత.. జూన్ 4న అన్ని గ్రామాలలో కిషోర బాలికల తల్లిదండ్రులతో సమావేశం.. జూన్ 6న యోగా, వ్యాయామం, క్రీడలు, ప్రాముఖ్యత, జూన్ 10న బాల్య వివాహాల నిర్మూలన అంశాలపై చైతన్యం కల్పించేలా కార్యక్రమాలు రూపొందించారు. 'కిశోరి వికాసం' కార్యక్రమంతో అవగాహన సద్వినియోగం చేసుకోవాలని అధికారుల పిలుపునిచ్చారు.

బాలికలకు ఎంతో ఉపయోగకరం..



'కిశోరి వికాసం' వేసవి శిబిరాలు బాలికలకు ఎంతో ఉపయోగపడతాయి. బాలికల హక్కులు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు బాలికలు సమాజంలో మెలగాల్సిన తీరును వివరిస్తున్నాం. కార్యక్రమాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకట రమణ, ఐసీడీఎస్, సీడీపీవో, పొన్నూరు

పోటీల్లో కళాకారుల నాటికలు ప్రదర్శన



'అసత్యం' నాటికలోని సన్నివేశం

పొన్నూరు: పొన్నూరు కళాపరిషత్ నిర్వహణలో ప్రముఖ బుర్రకథ కళాకారులు పద్మశ్రీ షేక్.నాజర్ శతజయంతిని పురస్కరించుకుని నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్‌లోని కొసరాజు వెంకట్రాయుడు కళావేదికపై శుక్రవారం నిర్వహించిన ఆహ్వాన నాటికల పోటీలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. కొసరాజు హరిత నటరాజ పూజ, ఎం.పార్థసారధి ప్రార్థనా గీతం, పొన్నూరు నటరాజ కూచిపూడి నాట్య నిలయం విద్యార్థుల శాస్త్రీయ నృత్యంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విశాఖ చైతన్య కళా స్రవంతి నిర్వహణలో మోదడుగు సుధ మూలకథ, పిన్నమనేని మృత్యుంజయరావు నాటకీకరణ, బాలాజీ నాయక్ దర్శకత్వంలో 'అసత్యం' నాటిక ప్రదర్శించారు. ఉత్తరాంధ్ర సౌజన్య కళాస్రవంతి నిర్వహణలో శ్రీ సలీం మూలకథ, రచనకు కె.కె.ఎల్ స్వామి దర్శకత్వంలో 'దేవరాగం' నాటికలో కళాకారులు తమ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ నిర్వహణలో పి.టి.మాధవ్ రచన, శ్రీ వాసు దర్శకత్వంలో '27వ మైలురాయి' నాటిక ప్రదర్శించారు. అనంతరం వృద్ధ కళాకారుల సత్కార సభకు పరిషత్ ఉపాధ్యక్షులు డి.ఎస్.ఆర్. కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన రంగస్థల నటి అమ్మన విజయలక్ష్మీ, బాపట్లకు చెందిన పౌరాణిక నటుడు డక్కుమళ్ల మోషె, వేటపాలెంకు చెందిన మేకప్ కళాకారుడు బుద్ధి వరప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. పలువురు ప్రముఖులు, కళాభిమానులు పాల్గొన్నారు.

కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి



విభాగాధిపతులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలకు సంస్థకు సంబంధించి కోర్టు కేసులను ఈనెల 20 నాటికి విభాగాల వారీగా వివిధ పరిష్కారంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ తమ చాంబర్‌లో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత విభాగాల వారీగా ఉన్న కేసులు, తీర్పు వచ్చిన కేసులు, పెండింగ్ ఉన్నవి వివరాలు తెలుసుకున్నారు. వివిధ అంశాలపై ఆయా సంస్థలు, వ్యక్తులు ఫైల్ చేసిన కోర్టు కేసుల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వర రావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ సిటి ప్లానర్ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో అందించే ఆహారంపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆర్టీఓ ఆఫీస్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

మహారాణా ప్రతాప్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



రాజపుత్ర కార్తిక మధూరిసింగ్‌కు సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహారాణాప్రతాప్‌సింగ్ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. రామరాజు ఇన్‌ఫ్రా డెవలపర్స్ రామరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి బి.జె.పి. రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ మహారాణాప్రతాప్‌సింగ్ పేరు హిందువుల గుండెల్లో ఉత్సాహాన్ని కలిగించేదని అన్నారు. భావితరాలు ఆయన చరిత్రను చదివి స్ఫూర్తిని పొందాలని చెప్పారు. బి.జె.పి.అర్బన్ జిల్లా మాజీ కార్యదర్శి రామకృష్ణ, నూతలపాటి తిరుపతయ్య, కె.శంకర్ సింగ్, ఎస్.కృష్ణసింగ్, మోహన్‌సింగ్, తిరుప్పావై అమృతవర్షిణి, డాక్టర్ కోగంటి వేంకటశ్రీరంగనాయకి, షిండే లక్ష్మీనారాయణ, సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు మాట్లాడారు. అనంతరం పత్రి గాయత్రీదేవి భక్తి గీతాలు ఆలపించారు. డాక్టర్ రాజపుత్ర మధూరివిజేతసింగ్, బాణాల వెంకటసాయిమణికంత, రాజపుత్ర కార్తిక మధూరిసింగ్‌ను, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు క్షత్రి ధర్మనారాయణసింగ్, ఏపీ చత్రపతి శివాజీ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జాజం సుబ్రహ్మణ్యం, బాణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

గాంధీ, నెహ్రూలపై అనుచిత వ్యాఖ్యలు

శ్రష్టి వర్మాపై ఫిర్యాదు



లక్ష్మీపురం: మహత్మాగాంధీ, నెహ్రూలపై కోరియోగ్రాఫర్ శ్రష్టి వర్మా వ్యాఖ్యలకు నిరసనగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం ఆధ్వర్యంలో హిందూ కళాశాల సెంటర్‌లో శుక్రవారం దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో పోలీసులు అడ్డుకున్నారు. కొద్ది సేపు హిందూ కళాశాల సెంటర్‌లో శ్రష్టి వర్మాకు వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు.

పోలీసులకు ఫిర్యాదు..

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అమరులైన జాతీపితా మహత్మాగాంధీ, నెహ్రూలపై కోరియోగ్రాఫర్ శ్రష్టి వర్మా వ్యాఖ్యలపై నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం, ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జి.టి.రోడ్డు రిషీ వ్యాలీ అపార్ట్‌మెంట్‌కు చెందిన ఎన్ఎస్‌యూఐ జిల్లా అధక్షుడైన షేక్ కరీం ఈనెల 3వ తేదీన సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ ఇన్స్ట్రాగామ్‌కి అనుసంధానమైన ట్రెడ్స్ అను యాప్‌లో బ్రౌజింగ్ చేస్తుండగా శ్రష్టి వర్మా అను ఇన్‌స్టా గ్రామ్ ఖాతా నుంచి దేశ జాతిపిత మహత్మాగాంధీ, దేశ మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూలను బాస్టర్డ్ అంటూ ఈ దేశానికి సర్వనాశం చేసి వెళ్లిపోయారు..రాబోయే రోజుల్లో వీళ్ల గురించి కాకుండా నిజమైన పోరాటం చేసిన వారి గురించి మాట్లాడుకోవాలని అని అదే విధంగా చదువుకునేటటువంటి పాఠ్య పుస్తకాలలో మహత్మాగాంధీ, నెహ్రూల చరిత్రలను తీసి వేయాలంటూ అసభ్యకరంగా మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య వీరులైన జాతీపిత మహత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల పై చేసిన శ్రష్టి వర్మా పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేశారు. నగరంపాలెం పోలీసులు కరీం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీర జవాన్‌కు విప్లవ జోహార్లు

పెదకాకాని: దేశ ప్రజల కోసం వీరోచితంగా పోరాడుతూ వీరమరణం పొందిన ఇండియన్ ఆర్మీ జవాన్ ఎం.మురళీనాయక్‌కు విప్లవ జోహార్లు అని మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకానిలో ఆయన మాట్లాడుతూ.. భారత్ యుద్ధం కోరుకోవడం లేదని.. 26 మంది హిందువులను నిర్దాక్షిణంగా కాల్చి చంపిన ఉగ్రమూకలు వారికి స్థావరం కల్పించిన పాకిస్తాన్ ఆర్మీదే ఈ పాపమని అన్నారు. వీర జవాన్ మురళీనాయక్ భారత్ దేశాన్ని కాపాడుతూ దేశం కోసం వీరమరణం పొందారన్నారు.

నేడు అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

పట్నంబజారు: శివ భక్తుల కోసం అరుణాచలంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ శుక్రవారం తెలిపారు. ఈనెల 12న పౌర్ణమి పురస్కరించుకుని శనివారం రాత్రి 9.15 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతోందని చెప్పారు. 11వ తేదీ గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, శ్రీకాళహస్తి దర్శించుకుని అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ, స్వామి దర్శనం పూర్తయిన తరువాత అదేరోజు రాత్రి బయల్దేరి 13వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని వివరించారు. ఈ సర్వీసుకు సంబంధించి 96164 నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. టికెటు ధర రూ.2,420 నిర్ణయించినట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 7382897459లో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటనపై శుక్రవారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అమరావతి రోడ్డు బీరువాల బజార్ ప్రాంతానికి చెందిన షేక్ ఆయేషా డెంటల్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పని చేసున్నారు. ఈనెల 3వ తేదీన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కింగ్ చేసి మరుసటి రోజు ఉదయం చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల పరిశీలించి, ఎంత వెతుకలాడిన వాహనం కనిపించక పోవడంతో అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు, కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: ఈనెల 20వ తేదీన చేపట్టిన సార్వత్రిక సమ్మెను రైతు, కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక పీఎల్ రావు భవన్‌లో రైతు, కార్మిక సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం నాయకులు కంచుమాటి అజయ్, పచ్చల శివాజీ, పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు, మన్నవ హరి ప్రసాద్, నాయకులు దండా లక్ష్మీ నారాయణ, మేడా హనుమంతరావు, ఎ.అరుణ్ కుమార్, బి.లక్ష్మణరావు, ఎన్.వేణుగోపాల్ రావు, నాగమల్లేశ్వరరావు, బొట్ల రామకృష్ణ, కంజుల విఠల్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



లక్ష్మీపురం: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సూర్యకుమార్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారానికి 12వ రోజుకు చేరింది. దీక్ష శిబిరానికి మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మానవత దృక్పథంలో చర్చిలకు పిలిచి సమస్యపై శ్రద్ధ పెట్టాలని కోరారు. అడుగుతున్న వేతన సవరణ అంశం, పెండింగ్ బకాయిలు గొంతెమ్మ కోరికలు కాదు అన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవళిక, వైస్ ప్రెసిడెంట్ జి.వనజ, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ పోరాట కమిటీ అధ్యక్షులు స్వచ్ఛంద ప్రసాద్, ఏపీ ఎంసీఏ కో ఆర్డినేటర్ దీక్షత, జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, జిల్లా నాయకులు జ్యోత్స్న పాల్గొన్నారు.

కేఎల్‌యూలో జాతీయ స్థాయి సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఎల్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సుబ్రహ్మణ్యం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో బీసీఏ, ఎంసీఏ విభాగాలు సంయుక్తంగా శుక్రవారం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బహుళ శాఖ పరిశోధనలపై జాతీయ స్థాయి సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య పి.సురేష్‌వర్మ, గౌరవ అతిథిగా ఎన్ఐటీ వరంగల్ ఆచార్యులు సురేష్‌బాబులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని.. వాటిని అందుకోవాల్సిన అవసరం ప్రతి విద్యార్థికి ఉందని అన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ.. 200లకు పైగా విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలు, ప్రాజెక్ట్‌లను ఇందులో ప్రదర్శించడానికి సురేష్‌వర్మ, సురేష్‌బాబులు అభినందించారని తెలిపారు. కార్యక్రమంలో వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, ఎంసీఏ విభాగాధిపతి కిరణ్, బీసీఏ విభాగాధిపతి భగవాన్, సదస్సు కోఆర్డినేటర్స్ కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు రామకృష్ణ, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంతో దేశంలోని 48 ప్రముఖ కంపెనీల ద్వారా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. శుక్రవారం వట్టిచెరుకూరు మడలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఎస్పీ సతీష్‌కుమార్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 30 జాబ్ మేళాలు నిర్వహించామని అన్నారు. దాదాపు 150 కంపెనీల ద్వారా 1536 మందికి ఉద్యోగాలను కల్పించామని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో 48 కంపెనీలు 1426 ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ , ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆశయాల మేరకు 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు చక్కని అవకాశాలని అన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవ రావు, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ దుర్గాబాయి, ప్రత్తిపాడు తహసీల్దార్ దరియావలి, మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పెరుమాళ్లు పాల్గొన్నారు.

సిబార్‌లో ఘనంగా క్రీడా దినోత్సవం



విజేతలకు మెమెంటో కప్ అందజేస్తున్న డాక్టర్ త్రిమూర్తి

పెదకాకాని: క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం క్రీడా కార్యదర్శి డాక్టర్ ఈ త్రిమూర్తి అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ రోజూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడల అభివృద్ధికి సిబార్ చేస్తున్న కృషిని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా చివరి సంవత్సరం బీడీఎస్ విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణ మోహన్, స్టూడెంట్ ఎఫైర్స్ డైరెక్టర్ ఎల్ ప్రణీత్, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట రమణారెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వస్తువుల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి



వినియోగదారులకు అవగహన కల్పిస్తున్న డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు

నెహ్రూనగర్: తూనికల కొలతల్లో మోసాలకు గురి కావద్దని లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలెంరాజు సూచించారు. లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం గుజ్జనగుండ్లలోని డీ మార్ట్‌లో వినియోగదారులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువులను కొనుగోలు చేసిన తరువాత ఆ వస్తువుపై ఉన్న సమాచారం తప్పనిసరిగా వినియోగదారులు తెలుసుకోవాలన్నారు. ప్యాకేజ్ కమోడిటీ యాక్ట్ ప్రకారం ఉత్పత్తిదారుడు పేరు, బ్యాచ్ నంబర్, ఆ వస్తువు ఎప్పుడు తయారు చేసిన తేదీ, వస్తువు రేటు పన్నులు అన్ని కలుపుకుని, ఎప్పటి లోపల ఆ వస్తువును ఉపయోగించాలని అనే తేదీ, కస్టమర్ కేర్ నంబర్, ఈ మెయిల్ ఐడీ తప్పనిసరిగా ఉండాలన్నారు. జాతీయ వినియోగదారుల సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ ఆహార పదార్థాలపై తప్పనిసరిగా పూర్తి వివరాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ జీ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జీ సునీల్‌రాజు పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

చేబ్రోలు: మండలంలో అక్రమ రేషన్ బియ్యం తరలింపు యధేచ్ఛగా జరుగుతోంది. మండల పరిధిలోని గొడవర్రు గ్రామం నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. కొద్ది రోజులుగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని అక్రమార్కులు ప్రజాప్రతినిధులు కొందరి అధికారుల అండదండలతో పొన్నూరు, చుండూరు ప్రాంతాల్లోని గమ్యస్థానాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గొడవర్రు నుంచి 15 బస్తాల బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో దాడి చేసి పట్టుకున్నారు. 5 రోజుల కిందట సుద్దపల్లి నుంచి 70 బస్తాల బియ్యంను మినీ లారీలో చుండూరుకు తరలిస్తూ మంచాల అడ్డరోడ్డు వద్ద పోలీసులకు పట్టుబడింది. మండల పరిధిలోని గ్రామాల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగుతున్నప్పటికీ రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులకు తెలియకపోవటం, స్పందించకపోవటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బ్రాడీపేట 2వలైనులోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పి.సీతారాం ప్రసాద్ పాల్గొంటారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.